క్లుప్తంగా

వేగంగా ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌లు



పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్స్ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్

నరసాపురం: నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా నరసాపురం పట్టణంలో ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్స్ కార్యక్రమం వేగంగా సాగుతుందని మున్సిపల్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు చెప్పారు. పట్టణంలో సాగుతున్న ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్స్ కార్యక్రమం వేగంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంపై లబ్ధిదారుల్లో అవగాహన పెంచాలన్నారు. సచివాలయాల ఉద్యోగులు, వలంటీర్లు చురుగ్గా పనిచేయాలని సూచించారు. వీలైనంత త్వరగా రిజిస్ట్రేషన్స్ చేసే కార్యక్రమం పూర్తి చేయాలని ఆదేశించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

పెనుగొండ: ఆచంట మండలంలో పోలింగ్ కేంద్రాలను తహసీల్దారు ఐపీ శెట్టి పరిశీలించారు. శుక్రవారం వల్లూరు, భీమలాపురంల్లో పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ఎన్నికల పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. ఎన్నికలు సజావుగా సాగేందుకు మౌలిక సదుపాయాలైన విద్యుత్, ఫర్నిచర్, నీటి వసతి, బాత్‌రూమ్‌లు, వృద్ధులకు, దివ్యాంగులకు అవసరమైన ర్యాంపులను పరిశీలించారు. ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ డీవీఎస్‌చలం, వెల్ఫేర్ అసిస్టెంట్ జామి దిలీప్‌లు పాల్గొన్నారు.

ముగిసిన కొండాలమ్మ ఉత్సవాలు

పెనుగొండ: దొంగరావిపాలెం కూరగాయల మార్కెట్ వద్ద కొండాలమ్మ అమ్మవారి 19వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 14 నుంచి ఆలయం వద్ద ఆలయం అర్చకులు పూజ్యం సత్యనారాయణ పర్యవేక్షణలో కుంకుమ, చామంతి, పుష్ప అర్చనలు, విశేష పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవాలు ముగింపు సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచి భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఉత్సవాలను శ్రీవెంకటేశ్వర కూరగాయల వర్తక సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

గోదావరికి పంచహారతులు

పెనుగొండ: మాఘ పౌర్ణమి సందర్భంగా సిద్ధాంతం కేదారీఘాట్‌లో వశిష్టాగోదావరికి శుక్రవారం రాత్రి హిందూ ధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో పంచ హారతులు భక్తి శ్రద్ధలతో ఇచ్చారు. కలగ భద్రుడు స్వామి బ్రహ్మత్వంలో ఇలపర్రుకు చెందిన పాతపాటి సుబ్బరాజు, నాగమణి దంపతులు పూజలు నిర్వహించి గోదావరి మాతకు పంచ హారతులు ఇచ్చారు. ఏకముఖ, ద్విముఖ, చతుర్ధ, పంచమ, కుంభ, నక్షత్ర, పూర్ణ, సర్ప హారతులను వేదమంత్రాలతో పండితుల సమక్షంలో ఇచ్చారు. పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు వందలాదిగా పాల్గొన్నారు.

జొన్నలగరువు యువకుడికి న్యూఢిల్లీ ఎయిమ్స్‌లో పీజీ సీటు

పాలకొల్లు అర్బన్: మండలంలోని శివదేవునిచిక్కాల పంచాయతీ శివారు జొన్నలగరువుకి చెందిన పీతల జోయల్ ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), న్యూఢిల్లీలో పీజీ సర్జరీ చదవడానికి ఫ్రీ సీటు సాధించారు. జోయల్ ఎంబీబీఎస్ కూడా అదే యూనివర్శిటీలో చదివి గతేడాది ఫిబ్రవరిలో పూర్తిచేశారు. ఎయిమ్స్, న్యూఢిల్లీ దేశవ్యాప్తంగా నిర్వహించిన పీజీ ఎంట్రన్స్ పరీక్షల్లో జోయల్ 980 ర్యాంక్ సాధించారు.

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పసుపులేటి

పాలకొల్లుసెంట్రల్: ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శిగా పట్టణానికి చెందిన పసుపులేటి చినబాబును నియమించారు. శుక్రవారం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ నుంచి ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. చినబాబు మాట్లాడుతూ వర్గీకరణ కోసం అనునిత్యం కృష్ణతో కలిసి పోరాటం చేస్తున్నామని అన్నారు. తమ పోరాటాన్ని గుర్తించి రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు చినబాబుకు అభినందనలు తెలియజేశారు.

అనారోగ్యం భరించలేక మహిళ ఆత్మహత్య

యలమంచిలి: శారీరక ఆరోగ్యం దెబ్బతినడంతో నొప్పుల బాధలు తాళలేక దొడ్డిపట్ల పంచాయతీ కుమ్మరపాలెం గ్రామానికి చెందిన దొడ్డా ధనలక్ష్మి (60) గురువారం ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కాకి శివనారాయణ తెలిపారు. ఆమెకు భర్త, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఇద్దరు కుమారులు పెళ్లిళ్ల తరువాత వేర్వేరు కాపురాలు పెట్టుకోగా ధనలక్ష్మి భర్తతో కలసి జీవిస్తుంది. ఆమె భర్త నాగేశ్వరరావు కొబ్బరిఈనెల వ్యాపారం చేస్తుంటాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో ధనలక్ష్మి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

జగనన్న పాలనలో నూతన ఒరవడి

పాలకొల్లు అర్బన్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో సరికొత్త ఒరవడిని తీసుకొచ్చారు. ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పాలకొల్లు అడబాల గార్డెన్స్‌లో శుక్రవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) అధ్యక్షతన నిర్వహించిన పాలకొల్లు నియోజకవర్గ ఆసరా సంబరాల్లో ప్రసాదరాజు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పాలనా సంస్కరణలో మార్పులు తీసుకువచ్చి మహిళల ఆర్థిక స్థితిగతులు మార్చారన్నారు. జగనన్న పాలనలో ప్రతి రోజూ పండుగలా సాగిందని అభివర్ణించారు. దళారులు, మధ్యవర్తులు, అవినీతి లేకుండా నీతివంతమైన పాలన అందించారని ప్రసాదరాజు ప్రశంసించారు. పగటి వేషగాళ్లు, మాయమాటలు చెప్పి డ్వాక్రా అక్కచెల్లెమ్మల మనస్సులు మార్చడానికి ప్రయత్నిస్తారని, అలాంటి వారి మాటలు నమ్మవద్దని హితవు చెప్పారు. నియోజకవర్గంలోని 42271 మంది అక్కచెల్లెమ్మలకు రూ.163.83 కోట్లు నాలుగు విడతలు అక్కచెల్లెమ్మల ఖాతాల్లోకి జమ చేసి ఇచ్చిన మాట సీఎం జగన్ నిలబెట్టుకున్నారని



ఆసరా చెక్కును అందజేస్తున్న ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు, గుడాల గోపి, గూడూరి ఉమాబాల



ఆసరా సంబరాల్లో పాల్గొన్న డ్వాక్రా మహిళలు

వివరించారు. అనంతరం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) మాట్లాడుతూ డ్వాక్రా రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్న సీఎం జగన్‌కు అక్కచెల్లెమ్మలు అండగా నిలవాలని కోరారు. పేద మధ్యతరగతి వర్గాలకు సంక్షేమ ఫలాలు అందించి సీఎం జగన్ దేవుడయ్యారన్నారు. పాలకొల్లులో ఎమ్మెల్యే సీటు గెలిపించి సీఎం జగన్‌కు బహుమతిగా ఇవ్వాలని కోరారు. తనకు పనులు చేయడమే తప్ప మాటలు రావన్నారు. నరసాపురం పార్లమెంట్ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ నవరత్నాలు అమలు చేసిన సీఎం జగన్ మహిళా సాధికారిత సాధించారన్నారు. సాధారణ బీసీ మహిళనైన తనకు పార్లమెంట్ సీటు ఇచ్చి సామాజిక న్యాయం చేశారన్నారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కచెల్లెమ్మలకు ఆత్మీయ విందునిచ్చారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కమిషన్ మెంబర్ చెల్లెం ఆనందప్రకాష్, జెడ్పీటీసీ సభ్యుడు నడపన గోవిందరాజుల నాయుడు, ఏఎంసీ మాజీ చైర్మన్ సాలా నరసయ్య, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చిలువూరి కుమారదత్తాత్రేయవర్మ, మండల పరిషత్ మాజీ ప్రతిపక్షనేత చిట్టూరి ఏడుకొండలు, మండల కన్వీనర్లు చందక సత్తిబాబు, పాతూరి బుచ్చిరాజు, విప్పర్తి ప్రభాకరరావు, పితాని చిన్న, ఎం మైఖేల్‌రాజు, ఉచ్చుల స్టాలిన్, మద్దా చంద్రకళ, పెదపాటి పెద్దిరాజు, బొడ్డేటి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

బట్టల వ్యాపారంతో ఆర్థికంగా నిలబడ్డా



అక్క చెల్లెమ్మలకు ఆసరా అమలు చేయడంతో మా గ్రామంలో బట్టల వ్యాపారం పెట్టుకున్నా. అలాగే వన్ గ్రామ్ గోల్డ్ ఆభరణాల వ్యాపారం పెట్టుకుని లాభాలు పొందాను. నాకు ఆసరా రుణమాఫీ నాలుగు విడతలు రూ.30 వేలు లబ్ధి పొందాను. నా కుటుంబానికి జగనన్న ఎంతో మేలు చేశారు. ఆయన రుణం తీర్చుకుంటా.

– సిర్రా మణి, మేడపాడు

క్యాన్సర్‌ను జయించా



నాకు ఆరోగ్యశ్రీలో క్యాన్సర్‌కి సంబంధించి శస్త్ర చికిత్స చేశారు. జగన్‌బాబు దయ వల్లే నేను మీ ముందు ఇలా మాట్లాడుతున్నా. ఆరోగ్యశ్రీలో నా లాంటి ఎందరికీ ప్రాణ బిక్ష పెట్టిన సీఎం జగన్ గెలిపించడానికి నేను సిద్ధం.

– తణుకుల జయలక్ష్మి, పెనుమదం

కుటుంబ అవసరాలకు ఉపయోగం



నవరత్నాల పథకాలు నా లాంటి పేద వారికి ఎంతో ఉపయోగం. నాకు వితంతువు పింఛన్ అందుతోంది. నాకు ఆర్థిక బలం చేకూర్చిన సీఎం జగన్‌కి రుణ పడి ఉంటాను. నేను వైసీపీకి ఓటేసి జగన్‌గారినే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాను.

– రొక్కాల మేరీ, లక్ష్మీనగర్, పాలకొల్లు

ప్రతి కుటుంబానికీ మేలు



సీఎం జగన్ పాలనలో ప్రతీ కుటుంబానికి మేలు కలిగింది. మా పిల్లలకు విద్యావసతి, విద్యాదీవెన, అలాగే అమ్మ ఒడి పథకాల ద్వారా లబ్ధి పొందాను. ఇంటి స్థలం వచ్చింది. ఎంతో మేలు చేసిన జగనన్నకు అండగా నిలుస్తాను.

– కాటూరి ఆగ్నేస్, లంకలకోడేరు

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం

పెనుగొండ: ఎంతమంది జత కట్టి వచ్చినా రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని నరసాపురం పార్లమెంటు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త గూడూరి ఉమాబాల అన్నారు. శుక్రవారం ఆచంట నియోజకవర్గంలో ఆచంట మండలం శేషమ్మ చెరువు, పెనుగొండ మండలం కొఠాలపర్రు, వీరప్ప చెరువు, సోమరాజు చెరువు, తామరాడ పాలెం, రామన్నపాలెం కాంగ్రేగుల లంక, వడలి, వెంకట్రామపురం, దేవల్లో మహిళతో మమేకమయ్యారు. చంద్రబాబు బీసీలను మభ్యపెడుతూ ఇప్పటి వరకూ పబ్బం గడుపుకున్నారన్నారు. నేడు సీఎం జగన్ చిత్త శుద్ధితో సామాజిక న్యాయాన్ని పాటిస్తూ అన్ని వర్గాలకు అండగా నిలుస్తున్నారన్నారు. దీంతో నానాటికి ప్రజల మద్దతు వైఎస్సార్ సీపీకి పెరుగుతుండడంతో ఒంటరిగా రాలేక అన్ని పార్టీలతో సిద్ధాంతాలకు విరుద్ధంగా జతకడుతూ చంద్రబాబు కుటిల రాజకీయం చేస్తూ అధికారంలోకి రావాలని పగటి కలలు కంటున్నారన్నారు.ఎన్ని ప్రయత్నాలు చేసినా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని ఆపలేరన్నారు. ప్రజలందరూ జగన్‌కు



వీరప్పచెరువులో బీసీ నాయకులు వైఎస్సార్ సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ఉమాబాల

మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పాలపర్తి సుబ్రహ్మణ్యం, శెట్టి బలిజ కార్పొరేషన్ డైరెక్టరు మామిడిశెట్టి కృష్ణవేణి, ఉమెన్ వెల్ఫేర్ కార్పొరేషన్ చైర్మన్ బొక్కా అరుణ, సర్పంచ్‌లు జక్కంశెట్టి శ్రీరాములు, గుబ్బల ఉషారాణి, యిళ్ల చంద్రకళ, దంపనబోయిన రూప, యర్రంశెట్టి బుజ్జి, పిల్లి అనంత లక్ష్మి, నల్లూరి సత్యనారాయణలు ఎంపీటీసీలు రెడ్డి గణేశ్వరరావు, చిటికెన గంగాభవానీ బాబీ, మండల కన్వీనర్లు నల్లిమిల్లి బాబిరెడ్డి, పలివెల శ్రీను, కాసాని శ్రీను, సాకా సుబ్రహ్మణ్యం, సొసైటీ చైర్మన్ గుడాల చినరామకృష్ణ, ఏఎంసీ వైస్ చైర్మన్ గుబ్బల వీర బ్రహ్మం, ఏఎంసీ డైరెక్టరు కుసుమే రాంబాబు, కానూరి ఏసు పాల్గొన్నారు.

మేడపాడులో వలంటీర్లకు వందనం



మేడపాడులో వలంటీర్లను సన్మానిస్తున్న దృశ్యం

యలమంచిలి: లంటీర్లు ప్రభుత్వానికి కళ్లు చెవులుగా పనిచేస్తున్నారని మేడపాడు సర్పంచ్ గంటా శాంతకుమారి అన్నారు. వలంటీర్లకు వందనం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మేడపాడు సచివాలయంలో వలంటీర్లను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ దేశంలో అన్ని రాష్ట్రాలకు తలమానికంగా నిలిచిందన్నారు. ప్రతి నాయకుడు గర్వంగా చెప్పుకునేలా వలంటీర్లు ప్రజలకు తమ సేవలు అందిస్తున్నారని ఆమె కొనియాడారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు దేగల సూర్యప్రభ వలంటీర్లకు ప్రత్యేకంగా మెమొంటోలు తయారుచేయించి అందజేశారు. కార్యక్రమంలో పాలకొల్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు గుర్రాల వెంకట్రావు, ఉప సర్పంచ్ ముద్దల శ్రీనివాస్, మాజీ ఉప సర్పంచ్ గంధం సత్యకీర్తి వైఎస్సార్ సీపీ నాయకులు అడబాల రామ్మోహనరావు, దేగల వెంకటేశ్వరరావు, కుక్కల బాలచంద్రన్ పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

పాలకొల్లు సెంట్రల్: నియోజకవర్గంలో సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం, ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్వాడీ సహాయకురాళ్ల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారిణి, పోడూరు సీహెచ్ ఇందిర తెలిపారు. పాలకొల్లు నియోజకవర్గంలోని పోడూరు మండలం జిన్నూరు గ్రామం అరుందతి పేట కేంద్రంలో జనరల్, పాలకొల్లు మండలం చందపర్రు గ్రామం చోడేపాడు కేంద్రంలో ఎస్సీ, బల్లిపాడు గరువు కేంద్రంలో ఎస్సీ, దగ్గులూరు గ్రామం కందరపెరడు కేంద్రంలో జనరల్ కేటగిరిలో ఫిజికల్ హ్యాండిక్యాప్డ్, యలమంచిలి మండలంలో వడ్డిలంక గ్రామం కేంద్రంలో ఎస్సీ కేటగిరిలో మొత్తం ఐదు పోస్టులు ఉన్నట్లు తెలిపారు. వీటిలో రెండు జనరల్, మూడు ఎస్సీ కోటాలో అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులు ఉన్నాయన్నారు. స్థానికులైన వివాహిత మహిళలు, వయస్సు 1 జూలై 2024వ తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి ఉండాలని వివరించారు. కనీస విద్యార్హత 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలని పేర్కొన్నారు. వికలాంగులైతే తక్కువ స్థాయి వైకల్యం కలిగి ఉండాలని వివరించారు. వారి పని వారు చేసుకుంటూ పిల్లలను చక్కబెట్టగలిగే అతి తక్కువ వైకల్యం ఉన్నవారికి ప్రాధాన్యత ఇస్తామని వివరించారు. దరఖాస్తు చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తుతో పాటు ధ్రువీకరణ పత్రాలు (విద్యార్హతలు, నివాసము, కులం, పుట్టిన తేదీ, అంగ వైకల్యం, భర్త మరణిస్తే మరణ ధ్రువీకరణ పత్రం, మైనర్ పిల్లలుంటే వారి ధ్రువీకరణ పత్రాలు, ప్రీ స్కూల్ ట్రైనింగ్ అయినచో సదరు ధ్రువీకరణ పత్రాలు) నకలు జతపర్చాల్సి ఉందన్నారు. 1 మార్చి 2024 సాయంత్రం 5 గంటల లోపు సమగ్ర శిశు అభివృద్ధి సేవా అధికారిణి, సమగ్ర శిశు అభివృద్ధి సేవా పథకం, పోడూరు కార్యాలయంలో స్వయంగా దరఖాస్తులు అందజేయాలన్నారు.

ఘనంగా రోటరీ ఇంటర్నేషనల్ వ్యవస్థాపక దినోత్సవం

పాలకొల్లు సెంట్రల్: రోటరీ ఇంటర్నేషనల్ స్థాపించి 119 సంవత్సరాలు పూర్తవుతుందని పట్టణ రోటరీ క్లబ్ అధ్యక్షులు పెనుమాక రామ్మోహనరావు తెలిపారు. శుక్రవారం స్థానిక రోటరీ క్లబ్ బిల్డింగ్‌లో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. రామ్మోహనరావు మాట్లాడుతూ 1905లో పాల హరీష్ అనే వ్యక్తి రోటరీ క్లబ్‌ను స్థాపించారన్నారు. నాటి నుంచి నేటి వరకూ రోటరీ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ ఎంతో మంది పేద మధ్యతరగతి ప్రజలకు సహాయ సహకారాలు అందిస్తున్నాయన్నారు. ఈ సందర్భంగా ముగ్గురు లెప్రసి అంగవైకల్యం ఉన్నవారికి చేతి స్టిక్‌లు, డ్రెస్సింగ్ చేసుకునేలా మెటీరియల్స్, టబ్‌లు అందజేశారు. కార్యక్రమంలో రావాడ సతీష్, క్లబ్ సెక్రటరీ ముత్యాల ప్రదీప్, అసిస్టెంట్ గవర్నర్ యిమ్మిడి రాజేష్, ముత్యాల శ్రీనివాసరావు, కఠారి నాగేంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అతిరుద్ర యాగ మహోత్సవాలు

పోడూరు: కవిటం గ్రామంలో శ్రీ సహస్రచండీ సహిత మహాసౌర పూర్వక చతుర్వేద స్వాహాకార సహిత దశమహావిద్యా పూర్వక అతిరుద్ర మహాయాగ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. యాగ మహోత్సవాల్లో భాగంగా 13వ రోజైన శుక్రవారం వేదపండితులు, భక్తులు అతిరుద్ర యాగం, గణపతిపూజ, గోపూజ, పుణ్యాహవాచనం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి శ్రీ మాణిక్యాంబ సమేత శ్రీ భీమేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపారు. శనివారంతో యాగ మహోత్సవాలు ముగియనున్నాయి. ముగింపు రోజున విశేష అన్న ప్రసాదం నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఆధ్యాత్మికవేత్త జంధ్యాల శ్రీనివాసశర్మ(నెలమూరు శర్మ), కవిటం సొసైటీ చైర్మన్ కర్రి శ్రీనివాసరెడ్డి, మండ కాశీవిశ్వనాధరెడ్డి, మేడపాటి రామారెడ్డి, సత్తి రామచంద్రారెడ్డి, పడాల వెంకట సత్యనారాయణరెడ్డి, సత్తి మురళీకృష్ణారెడ్డి తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



కవిటంలో అతిరుద్ర మహాయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

సీసీ రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

యలమంచిలి: గడపగడపకు మన ప్రభుత్వ నిధులతో గ్రామాలలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని ఏనుగువానిలంక మాజీ సర్పంచ్ వినుకొండ రవి చెప్పారు. గత ఐదేళ్లలో ఏనుగువానిలంకలో ప్రతి వార్డులో అభివృద్ధి చేశామన్నారు. ప్రజలకు మరింత సేవ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఉల్లంపర్తి జాన్ వైఎస్సార్ సీపీ నాయకులు దిడ్ల విజయ్‌కుమార్, పాలపర్తి సందీప్‌కుమార్, పిడకాల బాబూరావు, కోన ఏసురత్నం, సిద్ధిరెడ్డి రాంబాబు, పంచాయతీరాజ్ ఏఈ వర్ధనపు శ్యాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ఏనుగువానిలంకలో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పల్స్ పోలియో విజయవంతానికి కృషి

మొగల్తూరు: పల్స్ పోలియో కార్యక్రమం విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డాక్టర్ ఒ.దినేష్ సూచించారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఏఎన్‌ఎం, ఆశ వర్కర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మార్చి 3న నిర్వహించనున్న పల్స్ పోలియో విజయవంతానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు సూచనలు చేశారు. మండలంలోని 17 గ్రామాలకు సంబంధించి 0 నుంచి 5 సంవత్సరాల లోపు ఉన్న చిన్నారులను గుర్తించడంలో సిబ్బంది అలసత్వం వహించరాదన్నారు. ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా సిబ్బంది సమన్వయం పరుచుకుంటూ పల్స్ పోలియో విజయవంతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో డాక్టర్ లక్ష్మీ పార్వతి, ఎంపీహెచ్‌ఈఓ ఏఎస్ఎస్ఎన్ మూర్తి, సిబ్బంది సత్యవతి, సావిత్రి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ దినేష్

నేడు ఎల్బీచర్లలో కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో కనకదుర్గమ్మ విగ్రహాన్ని శనివారం ప్రతిష్ఠించనున్నారు. విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్యేక పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. శనివారం ఉదయం 8 గంటలకు విగ్రహప్రతిష్టాపన, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ సందర్భంగా అఖండ అన్నసమారాధన కార్యక్రమాలను నిర్వహించేందుకు ఆలయ కమిటీ చేస్తుంది.

అగ్ని ప్రమాద బాధితులను ఆదుకుంటాం

ఆకివీడు: అగ్ని ప్రమాద బాధితులను ఆదుకునేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు డీసీసీబీ చైర్మన్ పీవీఎల్ నర్సింహరాజు తెలిపారు. స్థానిక సంతపేటలోని ఇల్లాపువారి వీధిలో ఇటీవల విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో రేకు షెడ్డు దగ్ధమైన సంఘటనలో బాధితులకు గురువారం రూ.10వేలు ఆర్థిక సహాయాన్ని అందజేశారు.

వైఎస్సార్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయాలి

మొగల్తూరు: కేపీపాలెం బీచ్‌లో ఏర్పాటు చేసిన దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి 20 అడుగుల కాంస్య విగ్రహం ప్రారంభోత్సవాన్ని జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు కోరారు. శుక్రవారం మండలంలోని కేపీ పాలెంలో పార్టీ నాయకుడు అల్లం అంజిబాబు నివాసంలో ఏర్పాటు చేసిన నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి మంజూరు చేసిన రూ.కోటితో వైఎస్ రాజశేఖరరెడ్డి 20 అడుగుల కాంస్యవిగ్రహంతో పాటు ఆయన జీవిత విశేషాలను తెలిపేలా నిర్మించిన స్మృతివనాన్ని ఈ నెల 27న ప్రారంభిస్తామని పేర్కొన్నారు. కేపీపాలెం– పేరుపాలెం ప్రధాన రహదారి నుంచి మెట్రేవు నుంచి వయా అల్లంవారిమెరక మీదుగా కేపీ పాలెం బీచ్ వరకూ రూ.8 కోట్లతో నిర్మించే రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామన్నారు. రాష్ట్ర మంత్రులతో పాటు పలువురు ఎంపీలు పాల్గొనే ఈ కార్యక్రమాలను జయప్రదం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలన్నారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమాని బాపూజీ, వైస్ ఎంపీపీ కై లా సుబ్బారావు, సర్పంచ్ కడలి సోంబాబు, ఎంపీటీసీ సభ్యుడు డీవివి సత్యనారాయణ, నాయకులు కర్రి ఏసుబాబు, కంచర్ల బాబులు, అల్లం చిన్న, అందే తాత, గుబ్బల నారాయణమూర్తి, ఉప్పలూరి కృష్ణాజి, దొంగ శివన్నారాయణ, పుచ్చకాయల ముక్తేశ్వరరావు, కొండేటి మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



కేపీ పాలెంలో ఏర్పాటు చేసిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న చీఫ్‌విప్ ప్రసాదరాజు

శ్మశానవాటిక పనులు వేగంగా పూర్తి చేయాలి

నరసాపురం: శ్మశానవాటిక అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పట్టణంలోని 14వ వార్డులో జరుగుతున్న హిందూ శ్మశానవాటిక అభివృద్ధి పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ శ్మశానవాటికను అధునాతన వసతులతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. గతంలో శ్మశానవాటికకు వచ్చే రికి కనీసవసతులు ఉండేవి కాదన్నారు. అన్ని వసతులతో అభివృద్ధి చేశామని పేర్కొన్నారు. పెండింగ్ పనులు వేగంగా పూర్తి చేయాలని చెప్పారు. పనుల నాణ్యతను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకటరమణ, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, కౌన్సిలర్లు వంగా శ్రీకాంత్‌కన్నా, మల్లాడి బుజ్జి, కావలి నాని, యర్రా ఉమ,నాయకులు గోరు సత్తిబాబు, వల్లభుని శేఖర్ పాల్గొన్నారు.